ప్రజాశక్తి

ఆదివారం 12 ఫిబ్రవరి 2023

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

ఉక్కులో భారీ పేలుడు

- 9 మందికి తీవ్రగాయాలు, నలుగురి పరిస్థితి విషమం
- బయటపడ్డ భద్రతా ప్రమాణాల డొల్ల
- క్షతగాత్రులను పలువురు పరామర్శ

ప్రజాశక్తి - ఉక్కునగరం

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, ఎస్‌ఎంఎస్ - 2 విభాగంలో శనివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో తొమ్మిది మంది ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు తీవ్రగాయాలపాలయ్యారు. స్టీల్ మెటల్ స్లాగ్‌ను తరలిస్తున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. మధ్యాహ్నం 12.30 గంటలకు ఎస్‌ఎంఎస్ - 2లో స్లాగ్‌ను తరలించే క్రమంలో లాడెల్ కదలకుండా ఇరుక్కుపోయింది. మెటల్‌ను చల్లబరిచేందుకు అప్పటికే చుట్టూ నీటిని చల్లారు. ఇరుక్కుపోయిన లాడెల్‌ను కదిలించేందుకు జెసిబితో నెట్టేందుకు ప్రయత్నించిన క్రమంలో స్లాగ్ నీటిపై పడి పేలుడు సంభవించింది. దీంతో కంట్రోల్ రూమ్ బుల్లెట్‌ప్రూఫ్ అద్దాలు సైతం పగిలిపోయాయి. ఈ ప్రమాదంలో డిజిఎం అనిల్ పహిివాల, సీనియర్ మేనేజర్ జయ కుమార్, టెక్నీషియన్ ఈశ్వర్ నాయక్, ఛార్జ్‌మ్యాన్ పాండా సాహూ, కాంట్రాక్టు కార్మికులు బంగారయ్య, సూరిబాబు, అప్పలరాజు, శ్రీను, పోతయ్య గాయపడ్డారు. అనిల్ పహిివాల, జయకుమార్, శ్రీను, పోతయ్య పరిస్థితి విషమంగా ఉంది. క్షత

మిగతా 2లో..



పేలుడులో గాయపడిన ఉక్కు కార్మికులు

భద్రతా ప్రమాణాల పాటింపులో తీవ్ర నిర్లక్ష్యం : సిపిఎం

'భద్రతా ప్రమాణాల విషయంలో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యంగా ఉంది. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టి కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి. ప్లాంట్‌లో పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య తగ్గుతున్నా దానికి తగ్గట్టు కేంద్రం రిక్రూట్ చేయడం లేదు. అవుట్‌సోర్సింగ్ పద్ధతిని ప్రోత్సహిస్తోంది. ఇది క్షమించరాని చర్య. ఇప్పటికైనా పర్మినెంట్ ఉద్యోగాల భర్తీకి మోడీ సర్కారు చర్యలు చేపట్టాలి. పేలుడు ఘటనలో గాయపడ్డ వారికి పూర్తి స్థాయి వైద్యం అందించాలి. బర్న్ కేర్ యూనిట్‌తో కూడిన సూపర్ స్పెషాలిటీ ఇఎస్‌ఐ ఆసుపత్రిని నిర్మించాలని కార్మికవర్గం పోరాడుతున్నా కేంద్రం నిర్లక్ష్యం వహించడం దారుణం. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలి. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని మా పార్టీ ఆశిస్తోంది' అని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు.

పేలుడుకు బిజెపియే బాధ్యత వహించాలి

78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

వార్త 2లో..

కేంద్రం దుశ్చర్యలతో..

కునారిల్లుతున్న స్టీల్‌ప్లాంట్

- 3 వేల మంది రిటైర్ అయినా భర్తీకి ససేమిరా
- 2019లో రిక్రూట్‌మెంట్‌ను రద్దు చేస్తూ బిజెపి సర్కారు ఉత్తర్వులు
- డిపార్టుమెంట్‌ల్లో పొరుగు సేవలతో అనర్థాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఒకటా.. రెండా.. లెక్కకు మిక్కిలి తప్పిదాలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై 2014 నుంచీ కేంద్రంలోని బిజెపి సర్కారు కుట్రలు, దుశ్చర్యలకు పాల్పడుతూ ప్లాంట్ మనుగడను ప్రశ్నార్థకమయ్యేలా చేస్తోంది. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్‌ఎంఎస్-2లో జరిగిన భారీ పేలుడు ఘటన ప్లాంట్‌పై మోడీ కుట్రల ఫలితమేనని విశాఖ అంతటా చర్చ జరుగుతోంది. ఈ భయానక ఘటనతో ప్లాంట్ పరిసరాలన్నీ తీవ్ర ఆందోళనకు గురయ్యాయి. తొమ్మిది మంది కార్మికులు గాయాలపాలయ్యారు. ఇలాంటి ప్రమాదాలను లెక్కకడితే గడచిన రెండేళ్ల నుంచీ అంటే నూటికి నూరు శాతం ప్రైవేటీకరణకు ప్రధాని మోడీ నిర్ణయం తీసుకున్నప్పటి నుంచీ 103 మంది కార్మికులు గాయపడ్డారు. ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. బిజెపి ప్రైవేటీకరణ నిర్ణయంతో ప్లాంట్ మనుగడపై నీలినీడలు అలుముకున్నాయి. అయినా సరే



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న కార్మిక నేతలు

మొక్కవోని దీక్షతో శ్రమలో ఎలాంటి రాజీపడకుండా స్టీల్‌ప్లాంట్

మిగతా 2లో..

భీమిలిలో 'ఉపాధి'కి తూట్లు

వార్త 3లో..

ఘంటసాలకు ఘన నివాళి

వార్త 4లో..

681వ రోజుకు జెఎసి దీక్షలు

వార్త 8లో..



షబ్నమ్ సన్మాన సభలో పాల్గొన్న రమాప్రభ తదితరులు

క్రికెటర్ షబ్నమ్‌కు సన్మానం

ప్రజాశక్తి - కంచరపాలెం: క్రికెట్‌లో ప్రపంచ ఖ్యాతినార్జించిన షబ్నమ్‌ను డివైఎఫ్ఐ, చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యాన కంచరపాలెంలోని బిఎన్ఆర్ భవన్‌లో శనివారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ మాట్లాడుతూ, షబ్నమ్ వంటి క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యువత షబ్నమ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని, ఆటలు, పాటలు, విద్య తదితర రంగాల్లో రాణించాలని సూచించారు. ప్రభుత్వం ఆట స్థలాలు, క్రీడా మైదానాలు ఏర్పాటుచేయడం

మిగతా 2లో..

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ఆనందపురం మండలం తంగిడిబిల్లిలో నిర్మిస్తున్న జగనన్న కాలనీ ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 690 ఎకరాలలో 16800 ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం 1200 ఇళ్ల మ్యాపింగ్‌తో పాటు ట్యాగింగ్ కూడా పూర్తయిందని తెలిపారు. ఆరు వేల ఇళ్లకు పింత్ బీమ్ వరకు పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. మిగిలిన ఇళ్ల లబ్ధిదారులకు మ్యాపింగ్, ట్యాగింగ్ చేసి ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలన్నారు. ఇళ్ల నిర్మాణ పనులలో ఎటువంటి అలసత్వమూ ప్రదర్శించరాదని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్‌కు కావలసిన మౌలిక వసతులు కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 11 బోర్లు పనిచేస్తున్నాయని, ఇంకా ఏడు బోర్లు ఏర్పాటు చేయవలసి ఉందని, బోర్ల నుంచి నీటి పరిమాణం తక్కువగా ఉన్నందున ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని, ఇసుక కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఈ పర్యటనలో ప్రాజెక్ట్ డైరెక్టర్ (యుసిడి) పాపునాయుడు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, హౌసింగ్ ఉప కార్యనిర్వాహక ఇంజినీరు, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ రాజాబాబు

మొదటి పేజీ తరువాయి..

ఉక్కులో భారీ పేలుడు

గాత్రులను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఎఐటియుసి సీనియర్ నాయకులు జెవి.సత్యనారాయణమూర్తి, స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్‌భట్, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు పరామర్శించారు. బాధితులకు తగు న్యాయం చేయాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు.

కునారిల్లుతున్న స్టీల్‌ప్లాంట్

కార్మికవర్గం ఉత్పత్తి తగ్గనివ్వకుండా గణనీయమైన ప్రగతి సాధిస్తూ వస్తోంది. ఓ వైపు కార్మికులు ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా పోరాడుతూనే తీవ్రంగా శ్రమిస్తుండటంతో ప్లాంట్ గత ఏడాది లాభాల్లో నడిచింది. అయినప్పటికీ కేంద్రం కర్మాగారంపై నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తోంది.

మరమ్మతులకు నోచుకోని విభాగాలు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ దేశంలోనే తీర ప్రాంతంలో ఏర్పాటు చేయబడ్డ తొలి ఉక్కు కర్మాగారంగా ప్రసిద్ధికెక్కింది. సొంత గనులను కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కేటాయించకుండా నిర్లక్ష్యం చేశాయి. బిజెపి 2014లో అధికారంలోకి వచ్చిన నుంచీ ఈ ప్లాంట్‌ను మరింత ఆగాథంలోకి నెట్టేలా 'ప్రైవేటీకరిస్తాం లేదా కార్పొరేట్లకు అమ్మేస్తాం' అనే నినాదంతో గనులు, నిధులూ ఇవ్వకుండా, రిపేర్లకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయకుండా పూర్తిగా ఎండగట్టేసింది. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిని ప్రారంభించి 32 ఏళ్లయింది. అయినప్పటికీ క్యాపిటల్ రిపేర్లకు పలు విభాగాలు వచ్చినా నిధుల కేటాయింపునకు కేంద్రం బడ్జెట్ అనుమతులు ఇవ్వడం లేదు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఈ రిపేర్లు చేసుకోవడానికి సైతం కేంద్రంలోని మోడీ సర్కారు అనుమతి నిరాకరిస్తూ వచ్చింది. ప్లాంట్‌ను ఇలా నీరుగారుస్తూ భద్రతా ప్రమాణాలను దిగజార్చుతూ బిజెపి ప్రభుత్వం దుశ్చర్యలు చేస్తూ వచ్చింది. గడచిన నాలుగేళ్లలో సుమారు మూడు వేల మంది ప్లాంట్ నుంచి రిటైర్‌మెంట్ కాగా వారి స్థానంలో ఒక్కరినీ రెగ్యులర్ పోస్టుల్లో నియమించలేదు. పైగా 2019లో పోస్టుల భర్తీ కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌ను కూడా నియంతృత్వంతో బిజెపి రద్దు చేసింది. మరో వైపు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్లాంట్ యాజమాన్యం ఉద్యోగుల రీ డిప్లాయ్‌మెంట్ చర్యలు తీవ్రం చేయడం, ఖాళీ అయ్యే విభాగాల్లోకి అనుభవం లేని వారిని పొరుగు సేవలు (అవుట్ సోర్సింగ్)లో నియామకాలు చేయడం వంటివి భద్రతా ప్రమాణాలను దెబ్బతీసేలా చేసి తాజాగా జరిగిన పేలుడు ఘటనల వంటి ప్రమాదాలకు ఆస్కారమిచ్చిందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. కేంద్ర వైఖరి, దుర్మార్గపు విధానంతో కార్మికుల ప్రాణాలు గాలిలో దీపాల్లాగ మారిపోయాయి.

ఎఫ్‌ఆర్ కోట్‌లు కూడా కార్మికులకు ఇవ్వని కేంద్రం

కర్మాగారంలోని కార్మికులకు ఎఫ్‌ఆర్ జాకెట్ (కోట్)లు కూడా లేవు. యాజమాన్యం వాటిని కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉంది. ప్రమాదం జరిగినా ఎఫ్‌ఆర్ జాకెట్ శరీరంపై ఉంటే గాయాల తీవ్రత ఇంతగా ఉండేది కాదు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలనే కేంద్రం చర్యల వల్ల ఆఖరికి స్పేర్ పార్టులను కూడా యాజమాన్యం ఇవ్వకపోవడం దుర్మార్గం. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ ప్రైవేటీకరణ చర్యలను ఆపకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు

జె.అయోధ్యరాం, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్

క్రికెటర్ షబ్నమ్‌కు సన్మానం

ద్వారా పిల్లలు క్రీడల్లో మరింతగా రాణించే అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గర్ల్ ఎంపవర్‌మెంట్ చైర్మన్ మోదంబిక, బిఎన్‌ఆర్ ఫౌండేషన్ కన్వీనర్ బుజ్జి, ప్రతినిధి అప్పలరాజు, కృష్ణారావు, శ్రీనివాసరాజు, సంతోష్, ఐద్వా రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ డాక్టర్ ప్రియాంక, మహమ్మద్ సకిల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి రెబల్ అభ్యర్థిగా ఈర్లె శ్రీరామమూర్తి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నట్లు టిడిపి సీనియర్ నాయకులు ఈర్లె శ్రీరామమూర్తి తెలిపారు. ఇప్పటికే టిడిపి అభ్యర్థిగా చిరంజీవిరావు పేరును ఆ పార్టీ ప్రకటించింది. శ్రీరామమూర్తి కూడా అదే పార్టీకి చెందినవారు కావడంతో టిడిపి అభ్యర్థికి రెబల్ బెడద చోటుచేసుకుంది. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీరామమూర్తి మాట్లాడుతూ అన్ని రంగాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన విద్యావంతుడైన తనకు ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా విజయం చేకూర్చాలని కోరారు. టిడిపి ఆవిర్భావం నుంచి క్రమశిక్షణగల నాయకునిగా పార్టీలో తాను కొనసాగుతుండగా తనకు వచ్చిన రాజకీయ అవకాశాలను పార్టీ సీనియర్ నేత అయ్యన్నపాత్రుడు అడ్డుకున్నారని ఆరోపించారు. పార్టీ అధిష్టానం అన్ని విధాలా తనకు పదవులను కల్పించడానికి ప్రయత్నించినప్పటికీ ఆయన వ్యక్తిగత కక్షతో పార్టీకి వ్యతిరేక సంకేతాలు పంపి, తన రాజకీయ జీవితంలో ఎటువంటి పదవులూ రాకుండా చేశారని తెలిపారు. అందుకే తాను ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గానికి స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం భీమవరం తన స్వగ్రామమని, అంచెలంచెలుగా ఎదిగి స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి 40 ఏళ్లుగా వివిధ ఉద్యోగ సంఘాలకు నాయకునిగా ఉన్నారన్నారు. సమావేశంలో రెవెన్యూ సంఘం మాజీ అధ్యక్షులు గొర్లె అప్పలనాయుడు పాల్గొన్నారు.

పేలుడుకు బిజెపియే బాధ్యత వహించాలి

సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ ఎస్‌ఎంఎస్ - 2లో జరిగిన భారీ పేలుడుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమే బాధ్యత వహించాలని జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్, సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పేలుడు సంఘటన తీవ్ర భయాందోళనకు గురిచేస్తోందన్నారు. బిజెపి రెండేళ్లుగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై అనుసరిస్తున్న కుట్రపూరిత చర్యల వల్ల వరుస ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించి 32 ఏళ్లవడంతో అనేక విభాగాలు క్యాపిటల్ రిపేర్స్‌కు వచ్చాయన్నారు. రిపేర్స్‌కు బడ్జెట్ అనుమతులు, నిధులు ఇవ్వకపోవడంతోపాటు కనీసం బ్యాంకుల నుంచి రుణాలు మంజూరుకు కూడా మద్దతు ఇవ్వకుండా ప్లాంట్‌ను బిజెపి ప్రభుత్వం అష్టదిగ్బంధం చేసిందన్నారు. మరోవైపు రోజువారీ మెయింట్‌నెన్స్‌ను, భద్రతా ప్రమాణాలను ప్లాంట్ మేనేజ్‌మెంట్ నీరుగారుస్తూ వస్తోందన్నారు. నాలుగేళ్లలో సుమారు 3 వేల మందికిపైగా ఉద్యోగ విరమణ పొందినా వారి స్థానంలో ఒక్కరినీ రిక్రూట్ చేయకపోగా, 2019లో ఇచ్చిన రిక్రూట్‌మెంట్‌ను కూడా రద్దు చేసిందన్నారు. కేంద్రం, స్టీల్ యాజమాన్యం అనుసరిస్తున్న చర్యలన్నీ కార్మికుల ప్రాణాలకు రక్షణ లేకుండా చేశాయన్నారు.

ఇప్పటికైనా కేంద్రం స్టీల్‌ప్లాంట్ పట్ల వివక్షతను విడనాడి అమ్మకపు ప్రకటనను ఉపసంహరించుకోవాలన్నారు. క్యాపిటల్ రిపేర్‌లకు 2023-24 బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు నిధులు కేటాయించడంతో పాటు పర్మినెంట్ రిక్రూట్మెంట్ చర్యలు చేపట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

వివాదాల కొండకు 'గ్రీన్ కవర్' పూత

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఒక న్యూసెన్స్ స్థానంలో మరో న్యూసెన్స్‌ని మార్చుకోవడాన్నే మనం అభివృద్ధి అని పిలుస్తున్నాం'.. అంటూ బ్రిటిష్ ప్రగతిశీల మేధావి, రచయిత హెవలాక్ ఎలిస్ వ్యాఖ్యలను గుర్తుచేసుకునేలాగ విశాఖలోని సాగర తీరానగల రుషికొండపై పనులు సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన నుంచీ ఇక్కడ వేసే ప్రతి అడుగూ విమర్శలకు గురౌతోంది. మూడు దశాబ్దాలుగా ఈ కొండపై ఉన్న భవనాలను తొలగించేయడంతో తొలుత వివాదం మొదలై ప్రజలందరూ అటు మరలే చర్చకు ఆస్కారమిచ్చింది. ఆ తర్వాత నూతన రిసార్ట్స్, స్టార్ హోటళ్లు, మౌలిక వసతుల పేరుతో కొండచుట్టూ వైసిపి ప్రభుత్వం, ఎపి టూరిజం శాఖ తవ్వకాలు చేపట్టి నిర్మాణాలను శరవేగంగా చేపడుతున్నాయి. ఇది మరీ వివాదాస్పదంగా మారి పర్యావరణవేత్తల ఆగ్రహానికి గురైంది. తాజాగా మరో వివాదంలో రాష్ట్ర ప్రభుత్వం ఇరుక్కుంది. కొండ చుట్టూ తవ్వేసిన ఈ ప్రదేశంలో 'గ్రీన్ మ్యాట్'తో రాష్ట్ర సర్కారు కప్పే చర్యలు చేపట్టింది.



గతంలోకి వెళితే..

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) కూడా 2022 మే 11న తొలుత చేపట్టిన తవ్వకాలపై స్టే ఇచ్చింది. అధ్యయన కమిటీని కూడా అప్పట్లో నియమించింది. ఎపి కోస్టల్ మేనేజిమెంట్ అథారిటీ నోడల్ ఏజెన్సీగా ఉంటుందని చెప్పింది. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక చూస్తే....గతంలో ఏ స్థలంలోనైతే భవంతులు ఉండేవో ఆ పరిధిలోపలే ఏవైనా సరే నిర్మాణం చేయాలి. కానీ దానికి విరుద్ధంగా ఇక్కడి చర్యలున్నాయి.

రుషికొండపై ఏం జరుగుతోంది ?

సుందరమైన రుషికొండపైగల సర్వే నెంబరు 19లోని 50 ఎకరాలకు పైన ఉండే స్థలంలో సుమారు 9.88 ఎకరాల మేరకు హోటళ్లు, రిసార్ట్ భవనాలు, రూమ్‌లు ఉండేవి. రాష్ట్రంలో 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి సర్కారు అభివృద్ధి, ఆధునీకరణ పనుల పేరుతో 2021లో వీటన్నిటినీ పడగొట్టేసి కొత్తగా టూరిజం ప్రాజెక్టులను ఇక్కడ నిర్మించబోతున్నట్లు ప్రకటించింది. దీనివల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందంటూ టిడిపి విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సహా బిజెపి నాయకులు కోర్టునాశ్రయించారు. వైసిపి ఎంపీ రఘురామకృష్ణరాజు కూడా ఎన్‌జిటిని ఆశ్రయించి 100కు పైగా చెట్లు నరికేశారని, పచ్చదనం కనుమరుగైందని, 10 కిలోమీటర్ల మేర తీరం దెబ్బతిందని, పర్యావరణ విధ్వంసానికి కేంద్రంగా ఇక్కడ పనులున్నాయని ఫిర్యాదు చేశారు.

ఇప్పటికే 65 శాతం పనులు పూర్తి..

రాష్ట్ర ప్రభుత్వం రూ.176 కోట్లతో అధునాతన భవంతులను తవ్వేసిన కొండచుట్టూ నిర్మించేందుకు సన్నాహాలు ప్రారంభించి దాదాపు 65 శాతం పనులు పూర్తిచేసింది. పైగా ఎన్‌జిటి చెప్పిన 9 ఎకరాల్లో కాకుండా సుమారు 20 ఎకరాల్లో ఈ నిర్మాణాలు సాగడం కూడా వివాదాస్పదంగా మారింది. అంతకంతకూ మించిపోయి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయాన్ని కూడా ఇక్కడ నుంచే ఆపరేట్ చేస్తారన్న ప్రచారం సాగుతోంది. తాజాగా సిఎం వైఎస్ జగన్ 'తాను విశాఖకు షిఫ్ట్ అవుతున్నట్లు' ప్రకటించడం చూస్తే రుషికొండపై పనులు చకచకా సాగడం వెనక కారణం ఇదేనేమో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు.. ఈ ఏడాది భారీ అంతర్జాతీయ సదస్సులకు విశాఖ నగరం వేదికగా మారిన విషయం తెలిసిందే. రుషికొండ దారిలోనే సాగరతీరానగల ప్రముఖ స్టార్ హోటల్ రాడిషన్ బ్లూలో జి-20 దేశాల సమావేశాలు ఈ ఏడాది మార్చి 28, 29, 30ల్లో జరుగనున్నాయి. జి-20 దేశాలకు మనదేశం సారథ్యం వహించడంతో ఇదో ప్రాధాన్యతగా పాలకులు చెబుతున్నారు. మరోవైపు మార్చి 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సు జి-20కి ముందే విశాఖలో జరుగనుంది. ఈ నేపథ్యంలో గ్రీన్‌మ్యాట్ వేసి జరిగిన విధ్వంసాన్ని దాచేసే యత్నాలు ప్రభుత్వం చేస్తోందన్న విమర్శలు పెరిగిపోయాయి.

కల్లుగీత కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తాటి చెట్ల కల్లు (నీరా)ను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించి కల్లు గీత కార్మికులను ఆదుకోవాలని సీనియర్ న్యాయవాది, గీత కార్మికుల సంఘం నాయకులు గుడిపల్లి సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అక్కడ ప్రధాన నగరాలలో బహిరంగంగా నీరాను అమ్ముకునే అవకాశం కల్పించిందని చెప్పారు.

మహారాజశ్రీ అనకాపల్లి అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. No.30/2022 O.S.No. 159 / 2014

Between:
Dasari Rajeswari ... DHr
And:
Cheepurupalli Appana (Died) and Others ... J.Drs
To
3rd JDR / Respondent:
Kaduru Rajamma, W/o. Tata Rao
R/o. D.No. 4-40, Jangalapalam Village, Near Venkatapuram, Atchuthapuram Mandal.

నోటీసు

పై నెంబరు డిక్రీ బాకీ రాబట్టే నిమిత్తము దావాలో ప్రథమ జప్తుకాబడిన అమలు షెడ్యూలు దాఖలా స్థిరాస్థి 1వ జెడిఆర్ హక్కు అనుభవములలో గలది వేలం కోరి పై నెంబరున అమలు దాఖలు చేయగా మీకు అందు OR 21 R 64 CPC నోటీసు కొరకు తే:27-2-2023దీకి 3వ JDR/Respondent హాజరు నిమిత్తం వాయిదా కలదు. కావున పై కోర్టులో వాయిదా **తే:27-2-2023దీని ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయంగా కాని వకీలుగారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మాణించడమగునని యిందుమూలంగా తెలుపడమైనది.

REDNAM DURGA PRASAD
Advocate for DHR
D.No. 3-27, Poosarla Street,
Kasimkota Village & Mandal,
Anakapalli.
Cell : 9848506151, 834158078
అనకాపల్లి
తే:11-2-2023

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
E.P. 125/2018 IN DISPUTE No. 217/2015

Between:
Margadarsi Chit Fund Private Limited Kurmannapalem Branch Rep. by its Branch Manager ... Decree Holder
And:
Shaik Tajuddin Ahmad and others ... Judgment Debtors

PROCLAMATION OF SALE

Notice is hereby given that by an order of the Court named above, the property of 4th Jdr (i.e., Dhavala Radha, W/o. Madhusudhana Rao mentioned in the schedule hereunder has been ordered to be sold by public auction in satisfaction of the claim of the decree holder mentioned in the above E.P. for a sum or **Rs. 12,52,917/-** (excluding publication charges and battas) up to date of sale in the aforesaid dispute against the judgment debtor mentioned above.

Public are hereby informed that the sale will be by public auction and the same will be held between 10-30 A.M. to 5.00 P.M. on **03-03-2023** at Public Court i.e., **PRINICIPAL SENIOR CIVIL JUDGE'S COURT, VISAKHAPATNAM.**

At the sale the public are generally inited to bid, either personally or by duly authorized agent subject to terms and conditions to sale which may be had from the counsel for the decree holder whose address particulars are furnished hereunder.

SCHEDULE OF PROPERTY

THE IMMOVABLE PROPERTY OF JDR-4:

Visakhapatnam District, Visakhapatnam Sub-Registry, Ward No. 50, Block No. 81 in Survey No. 32/3P, built in 2000 S.ft D.No. 50-81-24, Flat No. 305, 2nd Floor, in G.V.K.Plaza, Seethammapeta, Visakhapatnam within the limits of Greater Visakhapatnam Municipal Corporation and bounded as folows:
East : Common Corridor
South : Flat No. 304
West : Open Space
North : Open set back Space
Dhr Value : Rs. 30,00,000/-
Ameen Value : Rs. 30,00,000/-
Value of Jdr : Not known as the JDR did not furnish the same.

P.MURALI GOPAL
Advocate,
Visakhapatnam-46
Cell : 9848320248
Visakhapatnam
Dt. 11-02-2023

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR JUDGE, AT VISAKHAPATNAM
S.O.P. No. 45 / 2022

Between:
1.Smt. Nadimpalli Venkata Subbalakshmi
2. Smt. Nadimaplli Malvika
3. Sri Nadimplli Sriram Manikanta Varma . .. Petitioners
And:
Nil ... Resoondent
The Petitioners are :
1.Smt. Nadimpalli Venkata Subbalakshmi, W/o. Late Venkata, Sankara Ramakrishnam Raju, Hindu, aged 46 years, Residing at D.No. 39-8-82, M.K.S.Devi Enclave Apartment, Flat No. GF-1, Near Skating Park, Muralinagar, Visakhapatnam-07.
Aadhaar No. 3956 8433 9334
2.Smt. Nadimpalli Malvika, D/o. Late Venkata Sankara Ramakrishnam Raju, Hindu, aged 26 years, Residing at D.No. 50-27-15/44, T.P.T. Colony, Opp. NRI Hospital, Seethammadhar, Visakhapatnam - 13.
Aadhaar No. 6103 7651 6464
3.Smt. Nadimpalli Sriram Manikanta Varma, S/o. Late Venkata Sankara Ramakrishnam Raju, Hindu, aged 25 years, Residing at D.No. 50-27-15/44, T.P.T. Colony, Seethammadhar, Visakhapatnam - 13.
Aadhaar No. 5627 6416 4636
And :
NIL ... Respondent

జనరల్ నోటీసు

ఇందుమూలముగా పై పిటిషనర్స్ 1 (భార్య) 2,3 అతని కుమారుడు, కుమార్తె అయి ఉన్నారు. వారు SOP No. 45/2022 ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దాఖలు చేసి యున్నారు. పై తెలిపిన పిటిషనర్లు మొదటి పిటిషనర్ యొక్క భర్త 2 మరియు 3 యొక్క పిటిషనర్ తండ్రి (లేటు) నడింపల్లి వెంకట శంకర రామకృష్ణంరాజుగారి పేరిట ఎస్.బి.ఐ.లో మ్యూచవల్ ఫండ్ ఫోలియో నెం. 10169541 (SBI Mangum Global Fund-Regular-IDCW), ISIN No. INF 204K01263 and Vide Follo No. 22014071 (SBI Blue Chip Fund Regular Plan - Growth), ISIN No. INF 200K01180, సెక్యూరిటీ రూపంలో గలవు. అందు చేతనపైన తెలిపిన డిపాజిట్లును తమకు ఇవ్వమని బ్యాంకు వారిని అడిగినారు. అందులకు బ్యాంకు వారు మమ్మలని వారసత్వపు సర్టిఫికేటు తీసుకురమ్మని ఆక్షేపించినారు. కావున పై గల S.O.P.No. 45/2022 గల కోర్టులో ఉన్నందున **తేది: 27-02-2023 ఉదయం 10-30 గంటలకు** స్వయముగా గాని, మీ తరపున న్యాయవాది ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలను తెలియచేసు కోవలెను. లేనిపక్షంలో ఆక్షేపణలు ఏమి లేవనీ నిర్ధారించుకుని పై S.O.P.No. 45/2022 పరోక్షముగా తీర్మానించి శ్రీ కోర్టు వారు తదుపరి చర్య తీసుకుందురు.

D.DANTSWARA RAO
A.VINDO KUMAR
Advocates, Visakhpatnam.
Cel : 9440826282, 8522005391

'ఉపాధి'కి తూట్లు

▸▸ జాబ్‌కార్డులున్నా కొందరికే కల్పన
▸▸ అమలుకు నోచుకోని వందరోజుల పని
▸▸ దక్కని గరిష్ట వేతనం.. చెల్లింపుల్లో జాప్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : వలసల నివారణ, కూలీలకు పనికల్పన చట్టబద్ధంగా అమలు చేస్తున్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఒక్కో జాబ్‌కార్డుకు ఏడాదికి వందరోజుల పనికల్పన, గిట్టుబాటయ్యేలా కూలీ, నిర్ధేశిత గడువులోగా కూలీ డబ్బులు చెల్లింపు, పని ప్రదేశంలో సౌకర్యాల కల్పన, ఇతర చట్టబద్ధమైన నిబంధనలన్నీ కాగితాల్లోనే తప్ప ఆచరణలో అమలు జరగడం లేదనే విమర్శలున్నాయి. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ నిధులకు గత బడ్జెట్ కంటే 33 శాతం మేర కోత పెట్టడంతో ఈ పథకం మరింత బలహీనమయ్యే ప్రమాదంలో పడింది.



అమనాం గ్రామ చెరువు పనుల్లో ఉపాధి కూలీలు

అమలుకు నోచుకోని వందరోజుల పని

భీమిలి మండలంలో 4,203 జాబ్ కార్డులుండగా, 5,323 మంది వేతనదారులున్నాయి. ప్రతి 50 జాబ్‌కార్డులకు ఒక మేట్ ఉన్నారు. కాగా జాబ్‌కార్డున్న ప్రతి కుటుంబానికీ ఏడాదికి వంద రోజులు పనికల్పించాలని ఉపాధి చట్టంలో ఉండగా, క్షేత్రస్థాయిలో 50రోజుల పనికల్పనే గగనమౌతోంది. చేసిన పనులకు సైతం సకాలంలో బిల్లులు చెల్లించే పరిస్థితి లేదు. దీంతో అనివార్యంగా ఇతర పనుల కోసం కూలీల ఎదురుచూపు తప్పడం లేదు. ఫలితంగా పని చేస్తే తిండి, లేకుంటే పస్తులే అనే దుస్థితి ఉంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో అనేక కుటుంబాల కూలీలు వలసబాట పడుతున్నారు.

ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా మస్తర్ల నమోదు

ఉపాధి పనికి వెళ్లే కూలీల హాజరు నమోదుకు ఇప్పటివరకు ఉన్న మాన్యువల్ విధానం స్థానే కేంద్ర ప్రభుత్వం కొత్తగా నేషనల్ మస్తర్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఎన్ఎంఎంఎస్) అమల్లోకి తెచ్చింది. దీని ద్వారా ఉదయం ఏడు గంటలకే పని ప్రదేశంలో కూలీల గ్రూప్ ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. పనిముగించిన తర్వాత 11గంటలకు మళ్లీ గ్రూపు ఫొటో తీసి మరోమారు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దాని ద్వారా కూలీల హాజరు నమోదై, వేతనాల చెల్లింపు ఉంటుంది. ఎప్పటి నుంచో అమలులో ఉన్న మాన్యువల్ మస్తరుతో పాటుగా తాజాగా ఎన్ఎంఎంఎస్ భారత ప్రభుత్వం అమలు చేసింది.

మస్తర్లలో ఎడిట్ ఆప్షన్ తొలగింపు

మాన్యువల్ మస్తర్లలో మాదిరిగా పనికి వచ్చే వేళల్లో మార్పునకు ఎన్ఎంఎంఎస్ యాప్‌లోనూ మార్చుకునే వెసులుబాటు ఉన్నప్పటికీ, దాన్ని తొలగించారు. దీంతో కాస్త ఆలస్యమైనా ఆరోజుకు పనికి రానట్లే. దీంతో వేతనదారుడు నష్టపోయే పరిస్థితి ఉంది.

అందని గరిష్ట వేతనం

ఉపాధి చట్టంలోని నిబంధన మేరకు రోజు కూలి గరిష్టంగా రూ.257గా ప్రభుత్వం నిర్ణయించగా, కేవలం నాలుగు గంటలే పని అమలుతో రూ.180 నుంచి రూ.210 రావడం కష్టమౌతోంది. ఇది కూడా పనిప్రదేశం, మట్టి స్వభావంతో ఒక్కో పంచాయతీలో ఒక్కోలా వస్తోంది. ఇక దాకమర్రి కోమటి చెరువు, అమనాం బారవాని చెరువు, మూలకుద్దు చెరువు పనుల్లో కూలీలకు రోజుకు సగటున రూ.200 వేతనం వస్తోంది. పెద నాగమయ్యపాలెం, టి.నగరపాలెంలో ఉపాధి నిధులతో రోడ్డు పనులు జరుగుతున్నాయి. మండలంలో 16 పంచాయతీలుండగా, చెరువులో మట్టి తవ్వకం, రోడ్డు నిర్మాణం వంటి 15 పనుల్లో 14 వందల మంది కూలీలు పని చేస్తున్నారు. దాదాపు మరో నాలుగు వేలమంది ఉపాధి జాబ్‌కార్డుల్లో పేర్లున్నా కూలీ దొరకడం లేదు.

జాబ్‌కార్డున్న అందరికీ పని

జాబు కార్డున్న వారందరికీ పని కల్పిస్తున్నాం. పనిచేసిన 15 రోజుల్లోనే వేతనం ఇస్తున్నాం. మండలంలో 121 మంది మేట్‌లు, 15 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు.



**జివిఎస్.గౌరి, ఎపిఒ
ఎన్ఆర్ఇజిఎస్,
భీమునిపట్నం**

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పెంట గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ దాసరి సత్తిబాబు (29) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై పద్మనాభం ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు శనివారం కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం ప్రకారం... పెంట గ్రామానికి చెందిన దాసరి సత్తిబాబు అదే గ్రామానికి చెందిన తమటపు నారాయణమూర్తికి ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన కరిమిరెడ్డి అప్పలనాయుడు పాత ఇంటి మట్టి గోడలను తొలగించారు. ఆ మట్టిని ట్రాక్టర్‌తో గ్రామం బయటకు తరలించి తిరిగి వస్తుండుగా మలుపులో బోల్తా పడింది. డ్రైవర్ సత్తిబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ యజమాని పోలీసులకు సమాచారమందించారు. మృతుని భార్య దాసరి కొండ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎఎస్ఐ నక్కా శ్రీను దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య దాసరి కొండ, ఇద్దరు పిల్లలు, వృద్ధురాలైన తల్లి ఉన్నారు. కుటుంబాన్ని ఎలా పోషించాలని మృతుని భార్య కొండ కన్నీరుమున్నీరవుతున్నారు.

పేద యువకునికి సాయం

ప్రజాశక్తి- భీమునిపట్నం : వినికిడి సమస్యతో ఇబ్బంది పడుతున్న స్థానిక కొంకివీధికి చెందిన శ్యామలరావుకు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం హియరింగ్ మిషన్‌కు అవసరమైన ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కాళ్ళ సన్నీ, ఎం.గోపి, దేవానంద్, అశోక్, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.


ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్న మహిళతో శస్త్ర చికిత్స జరిపిన వైద్యులు

కేన్సర్‌కు శస్త్రచికిత్స

ప్రజాశక్తి -తగరపువలస : శ్రీకాకుళం జిల్లా రైమనుగుడ ప్రాంతానికి చెందిన 54 ఏళ్ల మహిళకు వివిధ పరీక్షలు జరిపిన తర్వాత గర్భసంచి కేన్సర్‌గా గుర్తించిన సంగివలస అనిల్ నీరు కొండ ఆసుపత్రి వైద్యులు శుక్రవారం శస్త్ర చికిత్స జరిపి గర్భసంచి, అండాశయాలు తొలగించారు. నెలసరులు ఆగి ఏడాది తర్వాత మరలా రక్త స్రావం, తెల్ల బట్ట సమస్యతో ఇబ్బంది పడుతున్న ఆమె అనిల్ నీరు కొండ ఆసుపత్రిలో చేరారు. వివిధ పరీక్షలు చేసిన తర్వాత ఆమెకు గర్భ సంచి కేన్సర్‌గా గైనకాలజీ వైద్యులు నిర్ధారించారు. కేన్సర్ కణాల వ్యాప్తిని తెలిపే లింప్ నోడ్స్ గ్రంధులను తీసి పెథాలజీ డిపార్ట్‌మెంటుకు పంపించి పరీక్ష చేయగా, కేన్సర్ గర్భ సంచికి మాత్రమే వ్యాపించినట్లు తేలింది. దీంతో వైద్యులు శస్త్ర చికిత్స జరిపి గర్భ సంచి, అండాశయాలు తొలగించారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి సురేష్‌రెడ్డి దంపతులు శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇన్‌స్పెక్టర్ సిరిపురపు కనకరాజు స్వాగతం పలికారు. సురేష్‌రెడ్డి దంపతులు ముందుగా కప్పస్తంభాన్ని అలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. అధికారులు స్వామి వారి ప్రసాదాన్ని అందించారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు శనివారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు, జనరల్ ఇన్సూరెన్స్ చీఫ్ అడ్వయిజర్ జరజాపు సురేష్ ఆధ్వర్యాన ఆరోగ్యంపై తీసుకోవాల్సిన చర్యలు, స్కిల్ డెవలప్‌మెంట్, సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల ప్రతినిధి సంకురుభుక్త జోగారావు, ప్రిన్సిపల్ మేరీ గ్రేస్, హిందీ అధ్యాపకులు కోమలి తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సురేష్

పారిశ్రామికవేత్త అప్పారావు మృతికి నివాళి

ప్రజాశక్తి- ఆనందపురం : పారిశ్రామికవేత్త, ఆనందపురం మండల వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు సోదరుడు మజ్జి అప్పారావు అకాల మరణం పట్ల పలువురు సంతాపం తెలిపారు. తర్లువాడ గ్రామంలోని ఆయన నివాసం వద్ద ఉంచిన అప్పారావు భౌతికకాయాన్ని ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, పలు పార్టీ నాయకులు సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అప్పారావు ఇటీవల హైదరాబాద్‌లో జరిగినరోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. మూడు మండలాల జడ్‌పిటిసిలు, ఎంపీపీలు, మండల అధ్యక్షులు, భారీగా తరలివచ్చారు.


అప్పారావు భౌతికయాన్ని సందర్శించిన పలువురు నాయకులు


గ్రామంలో సంచరిస్తున్న పందులు

పందుల స్వైర విహారం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస పంచాయతీలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. నెల రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు పంచాయతీలో పందులను వదిలివేయడంతో గ్రామాలలో సంచరిస్తున్నాయి. గ్రామంలోని మురుగు గుంటలను స్థావరాలుగా చేసుకొని బురదను వెదజల్లుతూ వ్యాధులకు కారణం అవుతున్నాయి. పంచాయతీలో ఎప్పుడూ లేని పందులు అకస్మాత్తుగా దర్శనమివ్వడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ పందులను నివారించాలని అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ తెలిపారు. అధికారులు స్పందించి పందులు నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పశు వైద్యశిబిరం


పశు వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న
జెడ్పీటీసీ సభ్యులు గాడు వెంకటప్పడు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, సింగనబంద పంచాయతీ, కృష్ణంరాజుపేటలో శనివారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. 60 ఆవులకు వైద్య పరీక్షలు జరిపి, ఆయా పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువైద్య శిబిరాన్ని జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు ప్రారంభించారు. ఫలర్టన్ ఇండియా క్రెడిట్ బ్యాంక్, పశు సవర్ధక శాఖ సంయుక్తా ధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో దాకమర్రి పశు వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసు, సిబ్బంది వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాడు వెంకటనారాయణ, ఉప సర్పంచ్ మద్దిల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నెలవు నరవ రహదారి

ప్రజాశక్తి- గోపాలపట్నం : జీవీఎంసీ 88వ వార్డు పరిధి నరవ ప్రధాన రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ స్పీడ్ బ్రేకర్స్ లేకపోవడం, కాలేజీ విద్యార్థులు మితిమీరిన వేగంతో ప్రయాణించడం ప్రమాదాలకు కారణంగా కనిపిస్తున్నాయి. నరవ శివారులో విశాఖ ఇంజినీరింగ్ కళాశాల, బెహరా పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. కాలేజీలు ప్రారంభం, విడిచిపెట్టే సమయాల్లో విద్యార్థుల బైకుల స్పీడ్‌కు పగ్గాలు లేకుండాపోతోంది. ప్రధాన రహదారికిరువైపులా లింకేజీ రోడ్లు ఉన్నాయి. ఆ రోడ్ల నుంచి ప్రధాన రహదారిపైకి వస్తున్న వాహనాలు, ప్రధాన రహదారి నుంచి లింకేజీ రోడ్ల వైపు యూటర్న్ తీసుకుంటున్న వాహనాలు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట ఇటువంటి ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. పలువురు వాహన చోదకులు ప్రమాదాల బారినపడి కాలు, చేతులు విరగ్గొట్టుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. దీనిపై అధికారులు స్పందించి ప్రధాన రహదారిలో స్పీడ్ బ్రేకర్లు వేయాలని, యువత బైకుల వేగానికి పోలీసులు కళ్లెం వేయాలని స్థానికులు కోరుతున్నారు.


నరవ ప్రధాన రహదారి



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

ఘనంగా మురళీ మాధవ విద్యాలయం వార్షికోత్సవం

ప్రజాశక్తి -మాధవధార : మురళీ మాధవ విద్యాలయం 14వ వార్షికోత్సవాన్ని మాధవధారలోని పాఠశాల ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంలో మురళీ మాధవ విద్యాలయం కృషి అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థీ మంచిగా చదువుకొని భారతదేశం మెచ్చుకునే విధంగా తయారుకావాలని సూచించారు. మురళీ మాధవ విద్యాలయం కరస్పాండెంట్ సనపల మురళీధర్ మాట్లాడుతూ, 14 ఏళ్ల నుంచి పదోతరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నామని తెలిపారు. ఏటా పేద విద్యార్థులను ఎంపికచేసి ఉచితంగా విద్యను అందజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ మెంబర్ డాక్టర్ గొండు సీతారాం, ఎపిపిఎస్ఎ స్టేట్ ప్రెసిడెంట్ జె.సోమశేఖర్, 50వ వార్డు తెలుగుదేశం అధ్యక్షులు సనపల వరప్రసాద్, సనపల స్వామిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి

ప్రజాశక్తి-సిరిపురం : పద్మశ్రీ ఘంటసాల 49వ వర్ధంతిని శనివారం ఆర్‌కె.బీచ్‌లో ఘనంగా నిర్వహించారు. ఆర్‌కె.బీచ్ రోడ్డులోని ఘంటసాల విగ్రహానికి ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ, తన గాన మాధుర్యంతో కోట్లాది తెలుగు ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం పొందిన అమర గాయకుడు ఘంటసాల విగ్రహం వద్ద ఓపెన్ ఆడిటోరియం నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘంటసాల గాయకుడిగా, నిర్మాతగా, సంగీత దర్శకుడిగానే కాకుండా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 18 నెలలు జైలు శిక్ష అనుభవించిన దేశ భక్తుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్ జివి.రామచంద్రరావు, బొమ్మిడి సత్యనారాయణ, సన్ మూర్తి, మధుపాడ రవి కుమార్, ఈతలపాక సుజాత, డీవీ అప్పారావు, మస్తాన్ రెడ్డి, పెమ్మరాజు రాం పాల్గొన్నారు.

అనంతుని ఘాటు రోడ్డుకు రూ.8 కోట్లు

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభంలో ఉన్న అనంతపద్మనాభస్వామి కొండ ఘాటు రోడ్డు నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరైనట్లు ఎంపిపి కె.రాంబాబు తెలిపారు. పంచాయతీరాజ్‌శాఖ విశాఖపట్నం సూపరింటెండెంట్ రవీంద్రబాబు ప్రతిపాదనలతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పిఎంజిఎస్‌వై ఉపాధి హామీ నిధులు మంజూరాయాయని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ శాఖాధికారులు కొండ ఘాటు రోడ్డును శనివారం పరిశీలించారు.

55వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి -కంచరపాలెం : జివిఎంసి 55వ వార్డు పరిధి ధర్మానగర్ ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ కెవిఎన్ శశికళతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేలా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలుచేస్తున్నారని తెలిపారు. ఆయా పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందేలా పని చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, వార్డు అధ్యక్షులు కెపి.రత్నాకర్, దుప్పలపూడి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు నూకరాజు, రాయుడు శ్రీను, గంగామహేష్, ఎర్రంశెట్టి శ్రీనివాస్, జుంజూరు గోవింద్, కరుణ, లక్ష్మి, నాగలక్ష్మి, జామి దాసు తదితరులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు

ప్రజాశక్తి- గోపాలపట్నం : జీవీఎంసీ 89వ వార్డు పరిధి కొత్తపాలెంలో శ్రీగౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు కార్యక్రమాన్ని గౌరీ సేవా సంఘం ఆధ్వర్యాన నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చిరంజీవి దంపతులకు సన్మానం


సన్మాన సభలో మాట్లాడుతున్న ఎం.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్‌లో పనిచేసిన ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన టి.చిరంజీవి దంపతులను తోకాడ సమైఖ్య అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం సన్మానించారు. అపార్ట్‌మెంట్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లో చిరంజీవి 36 సంవత్సరాలు పనిచేశారని తెలిపారు. ఈ క్రమంలో ఉద్యోగంతోపాటు సామాజిక అంశాలపైనా పనిచేస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తుచేశారు. ఉద్యోగానికే విరమణ తప్ప, ఆయన సేవలకు కాదన్నారు. ఓపిక ఉన్నంతవరకు ప్రజాసమస్యలపై పని చేయాలని కోరారు. తోకాడ సమైఖ్య అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో చిన్నంనాయుడు, తౌడన్న, రమణ, రామన్న, మహిళా కమిటీ నాయకులు వరలక్ష్మి, స్వప్న అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గృహ సారథులకు శిక్షణ

ప్రజాశక్తి -మువలపాడ : జివిఎంసి 60, 61 వార్డులకు సంబంధించిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనందకుమార్ హాజరై మాట్లాడారు. వైసిపిని బలోపేతం చేయడానికి కార్యకర్తలు, నాయకులు అంకితభావంతో పనిచేయాలన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. పశ్చిమ నియోజకవర్గ వైసిపి పరిశీలకులు ఎస్ఎ.రెహమాన్ మాట్లాడుతూ, వాలంటీర్లు ప్రజలకు ఎంతగానో సేవ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్, కార్పొరేటర్లు పివి.సురేష్, కొణతాల సుధ, క్లస్టర్ కన్వీనర్ పి.కన్నబాబు పాల్గొన్నారు.

రోడ్లు, బిల్డర్ల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన అధ్యక్షులు జగన్మోహనరావు, కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఏపీ రోడ్లు, బిల్డర్ల ఎంప్లాయీస్ అసోసియేషన్ విశాఖ జిల్లా కార్యవర్గాన్ని సీతమ్మధారలోని రోడ్లు భవనాల కార్యాలయంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా సిహెచ్.జగన్మోహనరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎంఎ ఖాదర్, హానరబుల్ ప్రెసిడెంట్‌గా సుబ్రహ్మణ్యం, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.అర్జున, సెక్రెటరీగా ఆర్డర్ అప్పారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పివిటిఎస్.ప్రసాదరావు, జాయింట్ సెక్రటరీగా కృష్ణకుమారి, ట్రెజరర్‌గా వెంకట తేజ చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ పాపారావు తెలిపారు. ఈ మేరకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో నడుచుకోవాలని, అసోసియేషన్‌కు మంచి పేరు తెచ్చే విధంగా కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఎంవి.రానాప్రతాప్ ట్రెజరర్ సిహెచ్.లక్ష్మీనర్సుల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండగ

ప్రజాశక్తి-సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద గల రజకులు, 14, 24 వార్డుల పరిధిలోని కనకమహాలక్ష్మి రజక సేవా సంఘం, శ్రీలావతల్లి రజకుల సంఘం, శ్రీరామ రజక సంఘం, శ్రీ వెంకటేశ్వర రజక సంఘం, ఆంజనేయ రజక సంఘం, బాలగణపతి రజక సేవా సంఘాల ఆధ్వర్యాన బల్లల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ పండగకు ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు హాజరై మాట్లాడారు. రజకులు తమ కుల దైవమైన మహా శివుడు, వీరభద్రుడును కొలుస్తూ బల్లల పండగ నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. రజక సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు కోడూరి సత్యనారాయణ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, బాక్సర్ రాజు పాల్గొన్నారు.

కిటకిటలాడిన సింహగిరి

ప్రజాశక్తి-సింహాచలం: రెండో శనివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సింహగిరి కిక్కిరిసిపోయింది. భక్తులు అధిక సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, కార్లుతో కొండపైకి రావడంతో పార్కింగ్‌కు అవస్థలు పడాల్సి వచ్చింది. రద్దీ కారణంగా భక్తులు స్వామి దర్శనం స్వామి గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది.

సినీ సంగీత విభావరి

సీతమ్మధార : ఘంటసాల వర్ధంతి సందర్భంగా రాగమాలిక ఆధ్వర్యాన శనివారం పౌర గ్రంథాలయంలో 151వ మాసపు సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు చెన్నా తిరుమలరావు, కళా సంస్థల గౌరవాధ్యక్షులు కొణతాల రాజు, పల్లా వెంకటేష్ మాస్టారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఘంటసాల పాడిన ఏడుకొండలవాడా శ్రీనివాసా భక్తి గీతాన్ని కెవి.సత్యనారాయణ ఆలపించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పార్థసారధి, ఇందిరా సాహిణీ పాడిన కొండలన్నీ వెతికేను, బొమ్మిడి సత్యనారాయణ, మీనాకుమారి పాడిన తెలిసింది తెలిసింది, ఎడిసిపి మహ్మద్‌ఖాన్, గీత కలిసి మబ్బులో ఏముంది, శ్రీనివాస్, అంజలి పాడిన వయసే ఒక పూల తోట, జె.సత్యనారాయణ, పేరి గీత పాడిన ఈనాటి ఈ హాయి, రాము పాడిన ముద్దబంతి పువ్వులు, భరద్వాజ్, మీనా పాడిన చీర లేని చిన్నదాన ప్రేక్షకుల్ని అలరించాయి.

'బిసి ప్రజా వెల్ఫేర్' రాష్ట్ర అధ్యక్షునిగా రవికుమార్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆల్ ఇండియా బిసి ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా పెబ్బిలి రవికుమార్ ఎన్నికయ్యారు. విశాఖ పౌర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జాతీయ అధ్యక్షులు గూడూరు వెంకటేశ్వరరావు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, బిసి వర్గాల సమస్యల పట్ల జాతీయ, రాష్ట్రస్థాయిలో అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. బిసి వర్గాల న్యాయమైన డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేసేందుకు రాష్ట్ర అధ్యక్షుడ్ని నూతనంగా నియమించినట్లు తెలిపారు. చట్టసభల్లో బిసి వర్గాలకు జనాభా నిష్పత్తి ప్రకారం 56 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బిసి జనగణన జరపాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ మాట్లాడుతూ, ఏ ప్రభుత్వమైనా బిసిల మద్దతుతోనే ఏర్పడుతుందన్నారు. విద్య, ఉద్యోగం, రాజకీయ పరంగా బిసి వర్గాలు వెనుకబడి ఉన్నాయని తెలిపారు. విశాఖపట్నంలో కేంద్ర కార్యాలయం ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సౌత్ ఇండియా కన్వీనర్ కృష్ణవేణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, సిహెచ్.అప్పారావు, అప్పలరాజు, ఊర్వశమ్మ తదితరులు పాల్గొన్నారు.



రవికుమార్‌కు నియామకపత్రాన్ని అందిస్తున్న వెంకటేశ్వరరావు

వాయు రవాణా, విమానయాన చట్టాలపై సెమినార్

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో వాయు రవాణా నిర్వహణ, విమానయాన చట్టాలపై శనివారం సెమినార్ నిర్వహించారు. విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, టెక్నాలజీ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ సెమినార్‌కు నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.బాలకృష్టారెడ్డి, కోల్‌కతా నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జుడీషియల్ సైన్సెస్‌కు చెందిన ప్రొఫెసర్ సందీప్ భట్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బాలకృష్ణరెడ్డి విమానయాన చట్టం నియంత్రణ గురించి, వైమానిక చట్టాలకు సంబంధించిన అతి ముఖ్యమైన చికాగో కన్వేర్షన్, అంతర్జాతీయ విమానయాన విధానాలను గురించి వివరించారు. ప్రొఫెసర్ సందీప్ భట్ మాట్లాడుతూ విమానయాన సంబంధిత వివాదాల పరిష్కారం కోసం అంతర్జాతీయ వేదికల్లో చర్చలు ఉత్తమమైనవని తెలిపారు. వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.సూర్యప్రకాష్ భారత వైమానిక చట్టం, భారత ఉడాన్ స్కీం గురించి వివరించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పేపర్ ప్రెజెంటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మధుసూదనరావు, అధ్యాపక సలహాదారు ప్రొఫెసర్ శ్రీసుధ, జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్య అతిథికి జ్ఞాపిక అందజేస్తున్న వర్సిటీ వీసీ ఆచార్య సూర్యప్రకాష్

విశ్రాంత హెచ్‌ఎం బెనర్జీరావు మృతి

ప్రజాశక్తి-అనకాపల్లి

పట్టణానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కర్రి బెనర్జీరావు శనివారం మృతి చెందారు. పూడిమడక రోడ్డు రామాలయం వీధిలో ఆదివారం అంజక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. బెనర్జీరావు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు ఆయన శిష్యులు కావడం విశేషం. ఆయన 1971 నుంచి పురపాలక సంఘం పాఠశాలల్లో సైన్స్ అసిస్టెంట్‌గా వృత్తిని చేపట్టి అనకాపల్లి గవరపాలెం బాలికల ఉన్నత పాఠశాల, జీవీఎంసీ ఉన్నత పాఠశాల, గవరపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేశారు. పలు రచనలు చేయడంతో పాటు నాటకాలు, నాటికలకు దర్శకత్వం వహించారు. చలనచిత్ర రంగంలో పూరీ జగన్నాథ్‌తో పని చేయడంతో పాటు కొన్ని చలనచిత్రాల్లో నటించారు. ఆయనకు భార్య లీలావతి, ఇద్దరు కుమారులు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు తెలంగాణ రాష్ట్రంలో డిఎస్పీగా, చిన్న కుమారుడు కిషన్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఆయన మృతి పట్ల పట్టణానికి చెందిన పలువురు రాజకీయ నేతలు, వ్యాపారులు, లాఫింగ్ క్లబ్ ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.




బెనర్జీరావు (ఫైల్‌ఫొటో)

సాదాసీదాగా మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండల పరిషత్తు సర్వ సభ్య సమావేశంలో ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం సాదాసీదాగా జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో ఎటువంటి కొత్త ప్రతిపాదనలు ఆమోదించకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. గత సమావేశాల్లో ఆమోదించిన పనులపై ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండల పరిషత్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆయన కోరారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ రవిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఉగాదికి సామూహిక గృహ ప్రవేశాలు జరగాలని నిర్ణయించినందున గ్రామాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులందరూ జగనన్న గృహ నిర్మాణాలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు బైరాగి, ఏవో సోమశేఖర్, ఐసిడిఎస్ ఏపీవో మంగతాయారు, వెలుగు ఏపిఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి జగన్మోహన్, చిత్రంలో ఎంపిడిఒ

104వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

ప్రజాశక్తి-రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎఒబి ప్రధాన గేట్ ముందు నేవీ నిర్వాసితులు చేపట్టిన ఆందోళన శనివారం నాటికి 104వ రోజుకు చేరింది. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నేవీ జెఎసి నాయకులు మాట్లాడుతూ 104 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలను పరిష్కరించక పోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఎనిమిది గ్రామాల ప్రజలు ఉపాధి కోల్పోయారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించిన జెట్టీ నిర్మాణం చేయాలని, అంత వరకు నేవీ గేట్ లోపల నుంచి చేపల వేటకు ఆధార్ ఆధారంగా అనుమతి ఇవ్వాలని కోరారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 8 గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.

అసమర్థ పాలనలో కుంటుపడిన అభివృద్ధి

ప్రజాశక్తి-అనకాపల్లి

అసమర్థులు రాజ్యమేలతే అభివృద్ధి కొంటుపడుతుందని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలను మాయమాటలు, అబద్దాలతో గందరగోళానికి గురి చేస్తుందని విమర్శించారు. అవినీతి అక్రమాలు పెరిగి రాజధాని అభివృద్ధి కుంటు పడిందన్నారు. విభజన చట్టం సెక్షన్ 94 ప్రకారం రాజధానిని మార్చే అధికారం లేదని హైకోర్టు స్పష్టం చేసిందన్నారు. 151 మంది శాసనసభ్యులు ఉన్నారని, శాసనసభలో ఏమి చేసినా చెల్లిపోతుందని అధికార వైసిపి అహంకారంతో ఉందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా రూ.40 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను దందాలు, అక్రమాలు, దౌర్జన్యాలు చేసి దోచుకున్నారని ఆరోపించారు. అధికార పార్టీకి 28 మంది పార్లమెంటు సభ్యులు ఉన్నా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపలేకపోయిందని, రైల్వే జోను, పోలవరం ప్రాజెక్టు నిధులు తేలేకపోయిందని విమర్శించారు. సమావేశంలో టిడిపి నాయకులు బొడ్డేడ మురళి, మల్ల గణేష్, బుద్ధ భువనేశ్వరరావు, దూలం ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీశ్వరరావు

డైట్ కళాశాలకు గ్రీన్ ప్రచార అవార్డు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి డైట్ ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయ ఐజేఎన్ సంస్థ గ్రీన్ ప్రచార అవార్డు అందజేసినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెల్లా నరసింహం తెలిపారు. గ్రీన్ ఇంజనీర్స్ సంస్థ ఐజేఎన్ నిర్వహించిన గ్రీన్ డే 2022 కార్యక్రమంలో డైట్ కళాశాల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొని పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ఈ సంస్థ అందజేసిన 52 అవార్డుల్లో డైట్ 13 అవార్డులు గెలుచుకోవడం గర్వకారణమన్నారు. రెండు నెలల లోపు వెయ్యి మందికి పర్యావరణ అవగాహన ప్రచారాన్ని కల్పించిన తమ కళాశాల అధ్యాపకులు వై సుధీర్ కుమార్, వై హేమంత్ కుమార్, విద్యార్థులు కే అంజలి, కే మహేష్, ఎస్ జ్యోత్స్న, బి వాసంతి, కే సుజాత, పి వినీత దేవికు ఐజెఎన్ ప్రచారకర్త 2022 అవార్డును అందజేసినట్టు తెలిపారు. అవార్డులు పొందిన అధ్యాపక బృందం, విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, డీన్ అడ్మిన్ డాక్టర్ కెఎస్ ఈశ్వరరావు, అకాడమీ డీన్ కృష్ణ నాగ్, వివిధ విభాగాధిపతులు అభినందించారు.



డైట్ ఇంజినీరింగ్ కళాశాల



విజయసాయిరెడ్డిని సత్కరిస్తున్న ఎంపీ కుటుంబ సభ్యులు

విజయసాయిరెడ్డిని కలిసిన ఎంపీ కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి, విష్ణుమూర్తి కుమారుడు డాక్టర్ యశ్వంత్ వివాహం నేపథ్యంలో వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డిని శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన యశ్వంత్‌ను ఆశీర్వదించారు. విజయసాయిరెడ్డికి జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజు, ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్, డిసిసిబి మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ, అనకాపల్లి వైసిపి పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్, కార్పొరేటర్లు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పోస్టల్ పెన్షనర్ల సంఘం 8వ వార్షికోత్సవ మహాసభ

ప్రజాశక్తి-అనకాపల్లి

అఖిలభారత పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్ల సంఘం అనకాపల్లి డివిజన్ ఎనిమిదవ వార్షికోత్సవ మహాసభ నిర్వహించనున్నట్టు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ సూర్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్ గేట్ ఎదురుగా ఉన్న సిఐటియు కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ మహాసభకు సంఘం కేంద్ర సహాయ కార్యదర్శి ఎం ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ఎన్ నాగేశ్వరరావు, ప్రత్యేక ఆహ్వానితులుగా అనకాపల్లి పోస్టల్ సూపరింటెండెంట్ జె.ప్రసాద్ బాబు హాజరవుతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా 80 సంవత్సరాలు నిండిన సీనియర్ పెన్షనర్ల సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. సకాలంలో సభ్యులందరూ హాజరై మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఆంజనేయ స్వామి తీర్థం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని ఏనుగు తుని గ్రామంలో శనివారం ఆంజనేయ స్వామి తీర్థం ఘనంగా నిర్వహించారు. స్థానికులు ఉదయం నుండి స్వామివారికి పూజలు నిర్వహించారు. చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు నిమ్మదల మోహన్ రావు, కొప్పాక రామగణేష్, గొంతిని లోవగిరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న నైజీరియా పక్షులు

ప్రజాశక్తి-కశింకోట

నైజీరియా పక్షులు వేసవి విడిదికి విచ్చేశాయి. కశింకోట మండలంలోని పంట పొలాల్లో ఈ పక్షులు కనువిందు చేస్తున్నాయి. మనుషులు అవసరం కోసం ఒక చోట నుండి మరో చోటికి వెళ్తున్నట్లే నైజీరియా పక్షులు కూడా ఆహారం కోసం వేల కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడకు విచ్చేశాయి. వరి కోతలు పూర్తయి పంట పొలాలు అపరాలు, నువ్వులు వంటి సాగులోనూ, ఖాళీగాను ఉన్నాయి. నైజీరియా పక్షులు పొలాల్లో ఆహారాన్ని సేకరించుకుంటున్నాయి. నీటి సదుపాయం వద్ద గుంపులు గుంపులుగా వచ్చి ఉంటున్నారు. వేసవి ముగిసిన వెంటనే తమ దేశానికి పక్షులు వెళ్లిపోతాయి.



విహరిస్తున్న నైజీరియా పక్షులు



తొలగింపు ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్న ప్రమీలా గాంధీ

గ్రామాల్లో ఎన్నికల ప్రత్యేకాధికారి పర్యటన

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

మండలంలోని దిబ్బిడి, విజయరామరాజుపేట గ్రామాలలో చోడవరం నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారి ప్రమీలా గాంధీ శనివారం పర్యటించారు. గ్రామాలలో ఇటీవల మృతి చెందిన వారి వివరాలను బిఎల్‌ఒలను అడిగి తెలుసుకున్నారు. గ్రామసభలలో మృతి చెందిన వారి వివరాలను గతంలో పరిశీలించి తొలగించగా, వారి వివరాలను బిఎల్‌ఓలను, కుటుంబాలను అడిగి తెలుసుకున్నారు. దిబ్బిడిలో 147 పోలింగ్ బూత్‌లో 64, 148 పోలింగ్ బూత్‌లో 40 మంది మృతుల వివరాలను పరిశీలించారు. వీఆర్వో ఎర్రయ్య మండల సర్వేయర్ సింహాచలం, మణి తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రాండిక్స్ ఆధ్వర్యంలో
100వ ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

బ్రాండిక్స్ ఇండియా అపరల్ సిటీ సంస్థ సిఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం 100వ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ భారత భాగస్వామి దొరస్వామి తెలిపారు. బ్రాండిక్స్ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే 99 ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, 38,338 మందికి ఉచిత కంటి పరీక్షలు చేసినట్లు వెల్లడించారు. వారిలో 25,381 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామని, 3,644 మందికి మంది శస్త్ర చికిత్సలు చేయించామని వెల్లడించారు. 100వ ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం ఉదయం 8 గంటల నుంచి బ్రాండిక్స్ ఇండియా అపరల్ పార్క్ పక్కనే ఉన్న సిఎస్ఆర్ క్యాంప్ వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ వారి సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు.

బాల కార్మికులను నియమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- అనకాపల్లి

నిషేధిత పనుల్లో బాల కార్మికులను నియమిస్తే కఠిన చర్యలు తప్పవని సహాయ కార్మిక అధికారి కె.బాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. తుమ్మపాల రెవెన్యూ పరిధిలోని నూకాంబిక ఇటుక బట్టీలో ఇద్దరు అంతర్ రాష్ట్ర బాలికలచే పని చేయించినందుకు పునరావాసపు సొమ్ము కింద ఒక్కొక్కరికి 20 వేల రూపాయల చొప్పున చెల్లించినట్లు వెల్లడించారు. అలాగే బాల కార్మిక చట్టం 1986 ఉల్లంఘించినందుకు సదరు బట్టీ యజమానిపై కార్మిక శాఖ దాఖలు చేసిన క్రిమినల్ కేసులో అనకాపల్లి 13వ మెట్రోపాలిటన్ అదనపు మెజిస్ట్రేట్ శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 20 వేల రూపాయల అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు.

18వ సారి సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని హరిపాలెం గ్రామానికి చెందిన కాండ్రేగుల సూరిబాబు 18వ సారి తన సైకిల్ యాత్రను ప్రారంభించారు. హరిపాలెం నుంచి సింహాచలం వెళ్లి అక్కడ నుంచి అరుణాచలానికి శివరాత్రి దర్శనానికి చేరుకునేలా ప్రయాణం ప్రారంభించాడు. ఇప్పటికే విజయవాడ, తిరుపతి, శ్రీశైలం, షిరిడి, తమిళనాడు, భువనేశ్వరం వంటి దేవాలయాలకు 17 సార్లు సైకిల్ యాత్రలు విజయవంతంగా పూర్తి చేశారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

ప్రజాశక్తి-సబ్బవరం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నియమావళి శుక్రవారం నుంచి అమల్లోకి రావడంతో దానిని అమలు చేయాలని తహశీల్దార్ బి. సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో రాజకీయ నాయకులు ఎటువంటి ఫ్లెక్సీలు పెట్టరాదని, సంక్షేమ, అభివృద్ధి పనులు చేపట్టరాదని తెలిపారు. మండలంలో 1802 ఎమ్మెల్సీ ఓట్లు ఉన్నాయని, రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు.

ఘంటసాలకు భారతరత్న ఇవ్వాలి



పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న నాగభూషణం తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రముఖ సినీ గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావుకు భారత ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇవ్వాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం విజ్ఞప్తి చేశారు. ఘంటసాల 49వ వర్ధంతి సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పేదలకు బట్టలు, పండ్లు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలనచిత్ర చరిత్రలో తనదైన శైలిలో పాటలు, పద్యాలు, శ్లోకాలు పాడి తన గాన మాధుర్యంతో ప్రపంచంలో తెలుగు ఖ్యాతిని వ్యాప్తి చేసినట్లు చెప్పారు. ఘంటసాల ఆలపించిన భగవద్గీత విశ్వవ్యాప్త ప్రాచుర్యం పొంది ఆయన కీర్తిని అంతర్జాతీయ పటంపై నిలబెట్టిందన్నారు. అనకాపల్లిలో ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ముందుగా ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు విన్నకోట నీలేష్ గుప్తా, కార్యదర్శి వి సత్యనారాయణ, ఆర్ మల్లేశ్వరరావు, పి కృష్ణమోహన్, ఆర్. చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి

యలమంచిలి : ప్రజలను రంజింపజేయడమే వృత్తిగా ఎంచుకొని వ్యక్తిగతంగా ఎంతో నష్టపోయిన కళాకారుల్ని ఆదుకోవలసిన అవసరం ఉందని యలమంచిలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. స్థానిక ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఘంటసాల 49వ వర్ధంతి సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పల్లపు సోమవరం గ్రామానికి చెందిన కళాకారుడు పక్షవాతంతో బాధపడుతున్న విషయం తెలిసి ఆయనకు వీల్ ఛైర్‌ను తన వంతు సాయంగా అందిస్తానని ప్రకటించారు. స్థానిక చార్టెడ్ అకౌంటెంట్ బండారు బంగారు శెట్టి కళాకారులకు అందజేసిన హౌస్‌హోల్డ్ కిట్లను రమాకుమారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. సంగీతం, కోలాటం, నాదస్వరం, డప్పు మొదలైన కళాకారుల్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, లైబ్రరియన్ ఆనంద్, పూరీ జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి

సుజల స్రవంతిపై శ్వేతపత్రం విడుదల చేయాలి



ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పీలా

ప్రజాశక్తి -కశింకోట

ఉత్తరాంధ్ర జిల్లాల జీవనాడీ అయిన బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ కోసం జగన్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని ఉగ్గినపాలెం గ్రామంలో శనివారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో ఉత్తరాంధ్ర భూములు బీడు భూములుగా మారుతున్నాయన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలోని పంట కాలువలు, గ్రోయిన్లను మరమ్మతులు చేయకపోవడం వల్ల రైతులు సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైసిపి పాలనలో వ్యవసాయ రంగం నిర్వీర్యమవుతుందని ఆరోపించారు. ఒక్క మిస్డ్ కాల్‌తో వైసిపి నిరంకుశ పాలనపై టిడిపి చేస్తున్న పోరాటంలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కాయల మురళి, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, కరణం సోమేశ్వరరావు, కరణం గోవింద, సిదిరెడ్డి శ్రీనివాసరావు, వెంకటేష్, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని గొండుపాలెం గ్రామంలో శ్రీసీతారాముల ఆలయ నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి జగన్మోహన్, సర్పంచ్ బండారు కనకమల్లేశ్వరి, బండారు రామస్వామి పాత్రుడు, బండారు మంగపతి, దొగ్గ ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరులకు పూజలు

ప్రజాశక్తి -కశింకోట : కశింకోటలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం సందర్భంగా శనివారం ఉదయం నుండి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైసిపి రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీష్, బిజెపి జిల్లా అధ్యక్షుడు ద్వారాను రెడ్డి పరమేశ్వరరావు గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నాయకులు వేగి గోపీకృష్ణ, పెంటకోట రాము, బొడ్డేడ బాలాజీ, కాండ్రేగుల సంతోష్, పెంటకోట తాతారావు, ఆడారి నరిశింగరావు, దాడి నాగరాజు, వేగి దొరబాబు పాల్గొన్నారు.

ఒంటరి మహిళ పింఛను ఇప్పించరూ...

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని ఎర్రవరం గ్రామానికి చెందిన ఉరుము గంగ తల్లికి ఒంటరి మహిళ పింఛను ఇప్పించాలని ఆమె కోరుతోంది. గంగతల్లికి గతంలో ఒంటరి మహిళ పింఛను వచ్చేది. మూడు సంవత్సరాల క్రితం ఆమెకు పింఛను నిలిచిపోయింది. అప్పటి నుంచి ఆమె గ్రామస్థాయి నాయకుల నుంచి మంత్రి స్థాయి వరకు, గ్రామస్థాయి అధికారుల నుంచి కలెక్టర్ వరకు అనేక పర్యాయాలు తిరిగి దరఖాస్తులు పెట్టింది. కార్యాలయాల చుట్టూ తిరుగుతుంది. అయినా ఆమెకు పింఛను పునరుద్ధరించలేదు. తన ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా స్పందించి ఆగిపోయిన పింఛనును పునరుద్ధరించాలని ఆమె కోరుతుంది.

ఎఎన్ఎంలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి




సమావేశంలో పాల్గొన్న ఎపిటియుసి నాయకులు, ఎఎన్ఎంలు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎఎన్ఎంలపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఏపీ గ్రామ సచివాలయ ఏఎన్ఎం, హెల్త్ సెక్రటరీస్ అండ్ అదర్ ఎంప్లాయిస్ యూనియన్ అనకాపల్లి జిల్లా గౌరవ అధ్యక్షులు కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ భవనంలో శనివారం జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. రకరకాల యాప్‌లతో, సర్వేలతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 9,409 మందిపై సంజాయిషీ నోటీసులు ఇచ్చి మనోవేదనకు గురి చేస్తుందన్నారు. తక్షణమే వేధింపులు ఆపాలని, గ్రేడ్ టు ఏఎన్ఎంలుగా గుర్తించాలని, మూడుసార్లు బయోమెట్రిక్ విధానానికి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎల్‌వి రమణ, ఎం నారాయణ, సంఘం ప్రతినిధులు ఆదిలక్ష్మి, భవాని, ఉమామహేశ్వరి, దివ్య జ్యోతి, నూక రత్నం, రూప, లత, పద్మజ, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి అర్చన

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి, అయ్యప్ప స్వామి దేవాలయాన్ని జోనల్ కమిషనర్ సత్యనారాయణ దంపతులు శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయ కమిటీల అధ్యక్షులు వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సతీష్, ఉప్పల శ్రీనివాసరావు, కటకం లక్ష్మణరావు, ఆలయాల పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



జోనల్ కమిషనర్ దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం

సీనియర్ సివిల్ జడ్జి లీలావతి

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్: లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని, వీటితో సత్వర న్యాయ పరిష్కారం లభిస్తుందని నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి లీలావతి కోరారు. స్థానిక న్యాయస్థానాల సముదాయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఏళ్ల తరబడి కోర్టులకు తిరగకుండా రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. లోక్ అదాలత్‌లో కేసు ఒక్కసారి రాజీ అయితే అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదన్నారు. లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్ కేసులు న్యాయపరంగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఎటువంటి ఖర్చులు లేకుండా కాలం వృథా కాకుండా ఇవి దోహదపడతాయని తెలిపారు. చిన్న చిన్న కేసులు కూడా ఏళ్ల తరబడి పెండింగ్లో ఉంటున్న పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు మధు సూధనావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి లీలావతి

జనుము సాగుపై రైతుల మక్కువ



మార్కెట్ యార్డ్ సమీపంలో జనుము పంట

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :మండలంలోని రైతులు జనుము సాగుపై మక్కువ చూపుతున్నారు. వేబులపూడి, మెట్టపాలెం, పెద్ద బొడ్డేపల్లి, సుబ్బారాయుడుపాలెం తదితర ప్రాంతాల్లో జనుమును విరివిగా సాగు చేస్తున్నారు. అపరాల పంటలను నర్సీపట్నం తదితర ప్రాంతాల్లో గతంలో పండించినప్పటికీ సరైన గిట్టుబాటు ధర లేకపోవడం, వ్యవసాయ అధికారుల నుంచి సహకారం లేక పోవడంతో రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జనుము పంట అధిక దిగుబడి రావడమే కాకుండా లాభసాటిగా ఉంటుందని ఈ ప్రాంత రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.కట్టజనుముతో భూసారమే కాక ఔషధ గుణములు కలిగి ఉటుందని రైతు పోలుపర్తి ఈశ్వరరావు తెలిపాడు.శాస్త్రీయంగా ఇది చిక్కుడు జాతికి చెందిన మొక్క జనుము. ఈ పంటను వ్యవసాయ రంగంలో ముఖ్యంగా పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగిస్తున్నారు. పెద్ద బొడ్డేపల్లి, విశాఖపట్నం ప్రధాన రహదారికి సమీపాన సుమారు 20 ఎకరాలకు పైగా ఈ పంటను పండిస్తున్నారు. ఈ జనుము పంట పసుపు రంగు పూలతో చూపర్లకు కనువిందు చేస్తుంది. ఇది నార గింజలను దిగుబడి ఇస్తుంది. ఈ గింజలు సుమారు కేజీ రూ.100ల వరకు ఉంటుంది. గింజలతో పాటు పచ్చిరొట్టను పశువులకు మేతగా కూడా వేయవచ్చని, పొలాలకు ఎరువులుగా కూడా ఉపయోగించ వచ్చని రైతులు తెలిపారు. ప్రస్తుతం ఈ పంట పూత దశలో ఉంది. ఇది ఆశాకనంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ జన్మ పంట సాగుకు వ్యవసాయ అధికారులు సహకారాన్ని అందిస్తూ ప్రభుత్వ రాయితీలను కల్పించినట్లయితే బాగుంటుందని ఈ ప్రాంతానికి చెందిన రైతులు కోరుతున్నారు.

తాగునీటి ట్యాంకు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో నీలిగుంట గ్రామ పంచాయతీలో తాగునీటి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు వైస్ ఎంపీపీ దత్తుడు రాజు తెలిపారు. ఈ మేరకు శనివారం గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వరహాలబాబు మాట్లాడుతూ, జల జీవన్ మిషన్ ద్వారా గ్రామంలో ఇంటింటికి కుళాయికి సుమారు రూ.34 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ గ్రామ కమిటీ అధ్యక్షుడు సాయిబాబు, సీనియర్ వైసీపీ నాయకులు రమణ, తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న వైఎస్ ఎంపిపి దత్తుడు రాజు

వైభవ్ ఆభరణాల ప్రదర్శన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక కృష్ణ ప్యాలెస్‌లో వైభవ్ జ్యూయలరీ ప్రతినిధులు జ్యువెలరీ ప్రదర్శన, అమ్మకాలు చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి ప్రారంభించారు. స్థానిక వ్యాపారవేత్త వెలగ నారాయణరావు దంపతులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ సిహెచ్. జయరాం మాట్లాడుతూ, వైభవ్ జ్యువెలరీ నిర్వాహకులు ఏజెన్సీకి ముఖ ద్వారమైన నర్సీపట్నంలో ఇటువంటి కార్యక్రమాలు పెట్టడం అభినందనీయమన్నారు. నర్సీపట్నంలో షోరూం ఏర్పాటు చేస్తే కొనుగోలు దారులకు అనుకూలంగా ఉంటుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, అరుణ, కామేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న ఆర్‌డిఒ సీతారాం

నేడు వార్షికోత్సవం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన దేవాలయం ఎనిమిదవ వార్షికోత్సవ వేడుకలను ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రెసిడెంట్ దేవత కామేష్ ప్రకటనలో పేర్కొన్నారు. 12న ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కుంకుమ పూజలు, అభిషేకాలు, అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు.

టిడిపి బలోపేతానికి కృషి

గొడిచెర్ల పార్టీ క్లస్టర్ సమావేశంలో నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల గ్రామం లో శనివారం తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ ఆధ్వర్యంలో పార్టీ క్లస్టర్ సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ, పార్టీ ఆదేశాల మేరకు గ్రామాల్లో బాదుడే బాదుడు, రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు తీసుకువెళ్లి వైసిపి పాలనను ఎండగట్టాలన్నారు.గ్రామస్థాయిలో పార్టీ మరింత బలోపేతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు.అదేవిధంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలన్నారు. అనంతరం రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కురందాసు నూకరాజు, దేవర సత్య నారాయణ, గింజాల లక్ష్మణరావు, వెలగా శ్రీనివా సరావు, నానేపల్లి రాఘవ, అప్పలరాజు, రమేష్, కృష్ణ ,దొరబాబు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు



ఆలయానికి తరలి వచ్చిన భక్తులు

గ్రామాల్లో ఘనంగా ఉత్సవాలు

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్: మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో శనివారం గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులు భారీగా తరలివచ్చి గౌరీపరమేశ్వరులను దర్శించుకొని పసుపుకుంకుమ సమర్పించారు. గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్ నాగరత్నం, సూరిబాబు దంపతులు, ఉప సర్పంచ్ శ్రీనివాస్, డాక్టర్ అధికార గోపాలరావు, అధికార బలరామ్మూర్తి దంపతులు, వైస్ ఎంపిపి ఇన్నం రత్నం, రమణ దంపతులు, దండిన నానాజీ, ఎంపిటిసి అమ్మాజి, సతీష్ లు, వూడి చక్రవర్తి దంపతులు తదితరులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. ఉత్సవాల నేపథ్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రోలుగుంట: మండలంలోని చిన్నపెద్దపేట, పెద్ద పేట సింగరాజుపేట, యరకన్నపాలెం గ్రామస్తుల ఆధ్వర్యంలో వీరగంగాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. భక్తులకు భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ జాతర నాలుగు గ్రామాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చేపట్టారు. ఎలాంటి వివాదాలు లేకుండా పండగ వాతావరణంతో జరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు.



విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని నిండుగొండ గ్రామంలో నూతన నిర్మించిన ఆలయంలో సాయిబాబా, శ్రీకృష్ణుని విగ్రహాలను చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రతిష్టించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించు కున్నారు. గ్రామంలో ప్రజల ఐక్యతకు, ఆధ్యాత్మికతకు దేవాలయాలు నిలుస్తాయని, ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక సేవలో పాలు పంచుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

- భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని ఉపమాకలో దుర్గాదేవి ఆలయం 8వ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తుల తరలి వచ్చారు. అర్చకులు మహేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు పలు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొప్పిశెట్టి వెంకటరమణ, ఉప సర్పంచ్ ప్రగడ వీరబాబు, కొప్పిశెట్టి లచ్చుబాబు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

681వ రోజుకు జెఎసి దీక్షలు



నినాదాలు చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు శనివారానికి 681వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు గోపాలపట్నం జోన్ కార్యదర్శి పి.సత్యనారాయణ, పెందుర్తి జోన్ కార్యదర్శి జి.శంకరరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నష్టాలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమే కారణమని అన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకపోవడం, బొగ్గు సరఫరాను నిలుపుదల చేయడం, బ్యాంకుల నుంచి రుణాలను పొందకుండా అడ్డంకులు కల్పించడం వంటి చర్యలకు పాల్పడుతూ స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కొన్ని దశాబ్దాలుగా లాభాల్లో నడిచిన స్టీల్‌ప్లాంట్ దేశంలోనే అగ్రగామి పరిశ్రమగా నిలిచిందన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటుపరం చేయకూడదని డిమాండ్ చేశారు. దీక్షల్లో కూర్చున్న వారిలో నాయకులు పృథ్వీ, అప్పలరాజు, కె.ముత్యాలు, సిఐటియు మత్స్యకార మహిళలు జి.లక్ష్మి, జి.కొండ, ఎస్.రమ్య, జి.అప్పయమ్మ, ప్రొఫెసర్ ఎస్.సూరప్పుడు పాల్గొన్నారు.



కేశాల వితరణకు వచ్చిన విద్యార్థులు

కేశాల వితరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : క్యాన్సర్ చికిత్స పొందుతున్న వారు సాంత్వన పొందేలా పాఠశాల విద్యామండలి, వైజాగ్ లేడీస్ సర్కిల్ 201, వైజాగ్ రౌండ్ టేబుల్ 77 సభ్యులు ఓ స్ఫూర్తిదాయక కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా స్వచ్ఛంద కేశాల వితరణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి బీచ్ రోడ్డులోని వైఎంసిఎ ప్రాంతం శనివారం వేదికైంది. 57 మంది పోలక్స్ బాలికలు కేశాలను ఇచ్చారు. ఈ సందర్భంగా వైజాగ్ లేడీస్ సర్కిల్ 201 చైర్మన్ శ్వేత మాట్లాడుతూ ఈ సహాయ కార్యక్రమంలో భాగస్వాములైన విద్యార్థులను, వారి కుటుంబీకులను మెచ్చుకున్నారు. కేశాలను కోకు స్టూడియోస్ వారు సేకరించి క్యాన్సర్ బాధితులకు అనువుగా మార్పులు చేసి అందిస్తారన్నారు.

అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: మండలంలో వివిధ శాఖల అధికారుల పనితీరుపై మండల సర్వ సభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు నిలదీశారు. గృహ నిర్మాణం, పశువైద్యం, ఆర్బీకే, మత్స్యశాఖ తదితర అధికారులపై ప్రజాప్రతినిధులు ప్రశ్నల వర్షం కురిపించారు. మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండల అధ్యక్షురాలు కోన లోవలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొని నివేదికలు చదివి వినిపించారు. సైతారుపేటలో పశువైద్యం సరిగా లేదని, అధికారులు వచ్చినప్పుడు సర్పంచులకు తెలియ చేయలేదని, తాము తోలుబొమ్మలా మారామని సర్పంచ్ రావి రమణబాబు అధికారుల పనితీరును ఎండగట్టారు. ఆర్బీకేలు ఉత్సవ విగ్రహాల మాదిరిగా ఉన్నాయని, రైతాంగానికి ఏ మాత్రం ఉపయోగం లేదన్నారు. మత్స్యశాఖ అధికారులు తమ సమస్యల పరిష్కారం లో ఏమి చేశారంటూ వాకపాడు సర్పంచ్ మైలపల్లి శ్రీను లేవనెత్తారు. ఎవరేమి అడిగినా అధికారులు తమతమ శాఖల పురోగతిని చదివి వినిపించి మమ అనిపించారు. మొక్కుబడిగా తూతూ మంత్రంగా ఇలాంటి సమావేశాలు నిర్వహించడంపై సభ్యులు ధ్వజ మెత్తారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శ్రీరామచంద్రమూర్తి, జెడ్పీటిసి కాకర దేవి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సభ్యుడు



గ్రామ సభ నిర్వహిస్తున్న ఆర్‌డిఒ

నల్లమట్టిపాలెంలో గ్రామసభ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని బుచ్చిరాజుపేట పంచాయతీ నల్లమట్టిపాలెంలో శనివారం సాయంత్రం నర్సీపట్నం ఆర్డీవో జయరాం ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామంలో సర్వే నెంబరు 151-2లో వున్న భూమి పచ్చిక బయలుగా (22ఏ రికార్డుల్లో) రెవెన్యూ రికార్డుల్లో నమోదైవుంది. ఈ రికార్డుల నుంచి ఈ భూమిని తొలగించాలని గతంలో వరహా ఆక్వా ప్రతినిధుల దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో జయరాం, తహసీల్దార్ నీరజ నేతృత్వంలో గ్రామ సభ నిర్వహించారు. రైతులు, పెద్దల నుంచి అభిప్రాయాలు సేకరించారు. పూర్వం నుంచి ఈ భూముల్లో పశువులను మేపుకునే వారమని కొందరు రైతులు ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. తమ అభ్యంతరాలు, పూర్తి వివరాలు తెలియజేసేందుకు గ్రామస్తులు రెండు రోజులు గడువు అడిగారు. దీంతో ఆర్డీవో గ్రామసభను వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలోని లింగంపేట వద్ద భారీ నీటి ప్రాజెక్టు నుంచి కేడీపేటకు సరఫరా అవుతున్న మంచినీటి పైపులైన్ కొండగోకిరి వద్ద లీకేజీ అవుతోంది. దీంతో, రాకపోకలు సాగించే వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. వృథాగా తాగునీరు పోతుండటంతో సిహెచ్.నాగాపురం, పాత కేడీపేట, కొంగసింగి, ఏఎల్‌పురం తదితర గ్రామాలకు సరఫరా తాగునీరు పూర్తి స్థాయిలో సరఫరా కాలేదు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి లీకేజీలను అరికట్టాలని కోరుతున్నారు.



వృథాగా పోతున్న తాగునీరు

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రామునాయుడు



ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్: నర్సీపట్నంకు చెందిన సీనియర్ న్యాయవాది ఎస్. రాము నాయుడును అడి షనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపిపి)గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సెషన్స్ కేసులను ప్రభుత్వం తరపున ఆయన వాదిస్తారు. గత 32 ఏళ్లుగా న్యాయవాది వృత్తిలో కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో న్యాయవాదులు ఆయనకు అభినందనలు తెలిపారు.

హైకోర్టు తీర్పుతో పింఛన్లు పునరుద్ధరణ

లబ్ధిదారులకు చెక్కుల అందజేత

ప్రజాశక్తి -మాకవరపాలెం: మండలంలోని భీమ బోయినపాలెం గ్రామంలో హైకోర్టు తీర్పుతో లబ్ధిదారులకు పింఛన్లు పునరుద్ధరించారు. గ్రామంలో తెలుగుదేశం పార్టీ సానుభూతి పరులని గతంలో కొన్ని పెన్షన్స్ ప్రభుత్వ ఉద్యోగులు అధికార పార్టీ నేతలతో కుమ్మక్కై తొలగించారని, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిట్ పిటీషన్‌ను భీమబోయినపాలెం సర్పంచ్ రుత్తల మండకిశోర్ వేశారు. ఈ పిటీషన్‌ను పరిశీలించిన పిమ్మట హైకోర్టు 30-09-2022 నుంచి నిలిపివేసిన పెన్షన్ డబ్బులన్నీ కలిపి లబ్ధిదారులకు ఇవ్వవలసిందిగా సదరు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అధికారులు హైకోర్ట్ ఆదేశాలను అమలు చేయలేదు. దీంతో 7-02-2023న మళ్లీ హైకోర్టులో ప్రభుత్వ అధికారులపై కంటెమ్మెట్ వేశారు. ఇప్పటి వరకు నిలిపివేసిన పింఛన్లు ఇవ్వాలని తీర్పు జారీ చేసింది. దీంతో, ఎంపీడీఓ అరుణశ్రీ లబ్ధిదారులకు శనివారం చెక్ రూపంలో అందజేశారు.



చెక్కును చూపుతున్న రవీంద్ర

ఎన్నికల నిబంధనలు అమలు

ప్రజాశక్తి -మాకవరపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన నియమావళి శుక్ర వారం నుంచి అమల్లోకి వచ్చిందని తహసీల్దార్ ప్రసాద్ రావు విలేకర్లకు తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకూ ఎటువంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టరాదన్నారు. మండలంలో 1502 మంది పట్టభద్రుల ఓట్లు కలిగి ఉన్నారన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

గృహ నిర్మాణాలు చేపట్టాలి

ప్రజాశక్తి -మాకవరపాలెం: మండలంలో పలు గ్రామా ల్లో జగనన్న ఇళ్ల కాలనీ లేవుట్లు, ఇళ్ల నిర్మాణ పనులను శనివారం హౌసింగ్ జెఈ రామలింగస్వామి నాయుడు పరిశీలించారు. పలువురు లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నిర్మాణాలు ప్రారంభించని వారితో మాట్లాడాలని సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఉగాది నాటికి తప్పని సరిగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు.

యువకునిపై కేసు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: ప్రేమ పేరుతో యువతి వెంటపడి నమ్మించి మోసం చేసి, తీరా పెళ్లి దగ్గరకు వచ్చే సరికి ముఖం చాటేసిన యువకుడిని నర్సీపట్నం పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పట్టణ సీఐ నమ్మి గణేష్ వెల్లడించిన వివరాల ప్రకారం.. స్థానిక బీసీ కాలనీకి చెందిన మంతెన వెంకటేష్ (32) ఓ ప్రార్ధన మందిరంలో కీబోర్డును వాయిస్తుంటాడు. ఆ ప్రార్ధన మందిరానికి వచ్చే యువతితో సాన్నిహిత్యం పెంచుకొని, ప్రేమిస్తున్నానని నమ్మించి, సన్నిహితంగా ఉన్నాడు. గత ఏడాది ఆమెతో వివాహానికి నిశ్చితార్థం కూడా చేసుకున్నాడు. తర్వాత పెళ్లి ఇష్టం లేదంటూ ముఖం చాటేసాడని యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడుని రిమాండ్ కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

గృహ లబ్ధిదారుల ఆందోళన

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: లబ్ధిదారులకు ఇంటి స్థలాలు కేటాయించాలని గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని సొవ్వా పంచాయతీ కమలబంధ గ్రామంలో గిరిజన సంఘం నాయకులు పర్యటించి గ్రామంలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల పట్టాలను చూపిస్తూ గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవరత్నాల పథకం పేరుతో పేదలందరికీ గృహాలు నిర్మించి ఇస్తామని ప్రకటించి, నేటివరకు ఇంటి స్థలాలు కేటాయించ లేదన్నారు. పట్టాలిచ్చి స్థలాలు కేటాయించ పోవడం దుర్మార్గమన్నారు. ఒక్క వైపు పేదలందరికి ఉచితంగా గృహాలు నిర్మిస్తామని గొప్పలు చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం హామీలు ప్రకటనలకే పరిమితం అయ్యిందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి పట్టాలు పంపిణీ చేసిన లబ్ధిదారులకు ఇంటి స్థలాలు కేటాయించి గృహ నిర్మాణాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి మత్స్య, జయదేవ్, బంగార్రయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.



పట్టాలు చూపుతున్న లబ్ధిదారులు